TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 234 | బుధవారం ఏప్రిల్ 30 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5



# మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

**.లోటుపాట్లు లేకుండా పక్కాగా భద్రతా చర్యలు .చారిత్రక ప్రాంతల సందర్శనకు ఏర్పాటు చేయండి .అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్29 :**
మిస్ వరల్డ్ పోటీలను కట్టుదిట్టమైన భద్రతమధ్య నిర్వహించాలని, ఎక్కడా లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులనురేవంత్ రెడ్డి ఆదేశించారు. అందులోభాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ పోటీలకు వచ్చే అతిథులు .. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేయాలన్న సూచించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.


2లో..




2లో..

## జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి అమలు


హైదరాబాద్:
ధరణి చట్టంతో రైతులు, ఆడబిడ్డలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తండ్రులు, తాతలు సంపాదించిన భూములను ధరణి భూతం ఎత్తుకెళ్ళిందన్నారు. భూ యజమానుల ఇబ్బందులు తొలగించాలని ధరణిని బంగాళాఖాతంలో పడేశామన్నారు.



## మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు

హైదరాబాద్:
కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

2లో..




**రుణమాఫీపై ఏ బాయికాడ మాట్లాడుదాం..**

## కేసీఆర్ కు జగ్గారెడ్డి సవాల్

హైదరాబాద్:
'కేసీఆర్ పదేండ్లలో 20 వేల కోట్లు రుణమాఫీ చేస్తే.. రేవంత్‌రెడ్డి సర్కార్‌ఏడాదిలోనే 22 వేల కోట్లను మాఫీ చేసింది.. పదేండ్లలో వాళ్లు చేస్తే.. మేం ఏడాదిలోనే చేశాం. కేసీఆర్‌గొప్పోడా.. లేదా రేవంత్‌రెడ్డి గొప్పోడా.. ప్రజలు ఆలోచించాలి. రుణమాఫీ మీద డిబేట్‌కు కేసీఆర్‌ఎక్కడికి వస్తాడో చెప్పాలి. ఏ బాయి కాడికి, ఏ రచ్చబండ దగ్గరికి వచ్చిన సరే.. నేను సిద్ధమే' అని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌జగ్గారెడ్డి అన్నారు.ఇవాళ గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మహిళలు ఫ్రీ జర్నీ చేస్తే కేసీఆర్‌ఓర్వ లేక ఇష్టం వచ్చిన్నట్లు మాట్లాడుతున్నారని తెలిపారు.

02

## భారాస నేతల నిర్లక్ష్యమే 'కాళేశ్వరం'ని దెబ్బతీసింది: ఉత్తమ్

హైదరాబాద్:
కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. 'ఎన్‌డీఎస్‌ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే.. ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందన్నారు.



2లో..

"వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఎన్‌డీఎస్‌ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్‌డీఎస్‌ఏ అత్యున్నత బోర్డు. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మిడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది.



2 లో

## తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

**ఆదివాసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించొద్దు మంత్రి సీతక్క వెల్లడి**

**వరంగల్,ఏప్రిల్29 :**
ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు.మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు.

## యాదాద్రి జిల్లాలో భారీ పేలుడు.. ఇద్దరు మృతి.. ఏడుగురికి సీరియస్..!




2లో..

హైదరాబాద్:
యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లొజివ్ కంపెనీలో మంగళవారం (ఏప్రిల్ 29) భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి 9 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఇద్దరు మృతి చెందగా.. మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు.

## హైకోర్టును ఆశ్రయించిన ముగ్గురు ఐపీఎస్‌లు



2లో..

హైదరాబాద్:
పలువురు ఐపీఎస్‌లు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. భూదాన్ భూముల వ్యవహారంలో కొద్ది రోజుల క్రితం హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 26 మంది ఆఫీసర్లకు చెందిన భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. ఈ నెల 24న సింగిల్ బెంచ్ జస్టిస్ భాస్కర్‌రెడ్డి తీర్పు వెల్లడించారు. సింగిల్ బెంచ్ తీర్పుపై ముగ్గురు ఐపీఎస్‌లు అప్పీల్ చేశారు. మహేష్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు.కాగా, రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూముల కబ్జా, అక్రమాలపై దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చడానికి సీబీఐ విచారణ జరి పించాలని హైకోర్టు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సన్న ద్ధంగా ఉన్నారా? లేరా? అనే దానిపై వైఖరిని తెలియజేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా కీలక స్థానాల్లోని ఉన్నతాధికారులని, వారిపై ఆరోపణలు కూడా అంతే తీవ్రంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది.

# సంపాదకీయం

## పాక్ పాచికల్ని పారనీయొద్దు!

పహల్గామ్‌లో 26 మంది నిండు ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనన్న అభిప్రాయం రోజురోజుకూ దేశంలో



బలపడుతుండగా పాకిస్తాన్ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడుతోంది. మొదటి నాలుగు రోజులూ ఉలకని, పలకని ఆ దేశం అటుతర్వాత 'తటస్థ దర్యాప్తు' రాగం అందుకుంది. ఆ మర్నాడే అణు బెదిరింపులకు దిగింది. మరోపక్క భద్రతా మండలిలో చడీచప్పుడూ లేకుండా లాబీయింగ్ సాగించి తన పాచిక పారేలా చూసుకుంది. ఇక్కడే మన లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని 'తీవ్రంగా' ఖండిస్తు న్నట్టు తీర్మానం చెబుతున్నా అందులో దాడికి కారణమైన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) సంస్థ పేరు ప్రస్తావనే లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. చైనా ఎప్పటిలాగే పాకిస్తాన్ వాదనతో శ్రుతి కలిపింది. కానీ మన కు చాలా సన్నిహితుడనుకున్న డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి అమెరికాలో మొదలైనా పాక్‌తో ఆ దేశం అంటకాగుతున్న వైనం దిగ్భ్రాంతికరం కాదా? ఈమధ్యకాలంలో బలూచిస్తాన్‌లో రైలును దారిమళ్లించి అనేకుల్ని హతమార్చిన ఉదంతంలో భద్రతామండలి అందుకు కారణమైన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పేరు ప్రస్తావించింది. 2019లో పుల్వామాలో జరిగిన ఉగ్రదాడి ఉదంతంలో సైతం జైషే మొహమ్మద్ (జేఈఎం) ప్రమేయాన్ని మండలి తీర్మానం ఎత్తి చూపింది. కానీ ఇప్పుడేమైంది? ఇక్కడికొచ్చేసరికి ఈ నీళ్ల నములుడు దేనికి? అమెరికా రూపొందించిన తీర్మానంలో తొలుత ప్రస్తావనకొచ్చిన టీఆర్ఎఫ్ పేరు ఎందుకు ఎగిరిపోయింది? ఏ సంస్థనూ మాటమాత్రంగానైనా ఖండించటానికి ముందుకురాని తీర్మానం 'అంతర్జాతీయ శాంతికీ, భద్రతకూ విఘాతం కలిగించే ఉగ్ర ఘాతుకాలపై అన్నివిధాలుగా పోరాడతాం' అని బడాయి పోవటం చిత్రం కాదా! ఆ ఘనకార్యం మేమే చేశామని విర్రవీగిన సంస్థ పేరెత్తటానికి మండలికున్న అభ్యంతర మేమిటి? అఫ్గాన్‌లో సోవియెట్ సైన్యాన్ని ఎదుర్కొనటానికి అమెరికా ఆశీస్సులతో ఉగ్రవాద శిబిరాలు నడిపిన పాపిష్టి చరిత్ర తమకుందని ఈమధ్యే పాక్ రక్షణమంత్రి అంగీకరించాడు. తాజా పరిణామాల నేపథ్యంలో అలాంటి లాలూచీ ఇంకా కొన సాగుతున్నదనుకోవాలా? ప్రధాని నరేంద్ర మోదీ మొన్న బిహార్‌లో కావొచ్చు... తాజాగా 'మన్ కీ బాత్'లో కావొచ్చు, పహల్గామ్ ఉదంతంలో బాధితులకు సరైన న్యాయం దక్కేలా చేస్తామని స్పష్టం చేశారు. పాత్ర ధారుల్ని, సూత్రధారుల్ని తీవ్రాతితీవ్రంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. మంచిదే. అయితే ఈ కృషి బహుముఖాలుగా వుండాలి. ఉగ్రవాదుల్ని పట్టి బంధించటానికి ప్రయత్నించటంతో పాటు అంతర్జా తీయంగా పాక్‌ను ఏకాకిని చేయటానికి కృషి చేయాలి. ఉగ్రసంస్థల్ని కిరాయి ముఠాలుగా వాడుకుంటున్న దాని నైజాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టాలి. పాకిస్తాన్ తెరవెనకుండి భద్రతామండలి తీర్మానంలో చేయించిన మార్పులు చిన్నవేమీ కాదు. ఉగ్ర సంస్థ టీఆర్ఎఫ్‌తో పాక్ సర్కారు ఎంతగా చెట్టపట్టాలు వేసుకున్నదో మండలిలో జరిగిన పరిణామాలే తేటతెల్లం చేస్తున్నాయి. తీర్మానంలో టీఆర్ఎఫ్ ప్రస్తావన లేకుండా చేసిన క్షణాల్లోనే ఆ ఉగ్ర సంస్థ తన పాత ప్రకటన 'అధికారికమైనది' కాదంటూ స్వరం మార్చటం గమనించదగ్గది. దాడి జరిగిన వెంటనే తామే అందుకు కారకులమని చెప్పిన ఆ సంస్థ మండలిలో పాక్ వాదనకు అనుగుణంగా ఆ ప్రకటన తమది కాదనటమే కాదు... నింద మోపటం కోసం భారత సైన్యం కావాలని చేసిన పనిగా ఆ ఉదంతాన్ని వక్రీకరించే ప్రయత్నం చేసింది. లష్కరే తోయిబా విషపుత్రిక అయిన టీఆర్ఎఫ్ 2020 నుంచీ జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు పాల్పడుతోంది. ఆ సంస్థను మన దేశం నిషేధించింది కూడా! ఏదో విధంగా మన దేశాన్ని ఇబ్బందులపాలు చేయటం కోసం ఏళ్ల తరబడి స్వయంగా నిర్మించిన ఉగ్రవాద సాలెగూటిలో తానే చిక్కుకుని పాకిస్తాన్ తరచు విలవిలలాడుతోంది. 2015లో పెషా వర్ కంటోన్మెంట్ ప్రాంతంలోని పాఠశాలపై ఉగ్రవాదులు ఒక్కుమ్మడిగా విరుచుకుపడి 140 మంది బాలబాలికల్ని కాల్చిచంపారు. ఆ మరుసటి ఏడాది క్వెట్టాలో పోలీసు శిక్షణ కేంద్రం ఆవరణలోకి ప్రవేశించి 60 మందిని హతమార్చారు. ఒక యూనివర్సిటీపై దాడికి దిగి ప్రొఫెసర్‌తోపాటు 20 మంది విద్యార్థుల ప్రాణాలు తీశారు. ఈ మాదిరి ఉదంతాలు ఎన్నెన్నో. అయినా పాకిస్తాన్ వైఖరిలో ఆవగింజంతైనా మార్పు లేదు. పశ్చాత్తాపం అసలే లేదు. పహల్గామ్ దాడిని ఖండించకుండా పర్యాటకులు ప్రాణాలు కోల్పోవటం విచారకరమంటూ ప్రకటన చేసి చేతులు దులుపుకుంది. పాకిస్తాన్ తీరు మారదని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దబాయింపు చూస్తే తెలుస్తుంది. ఉగ్రదాడిపై ఆయనగారికి 'తటస్థ, పారదర్శక, విశ్వసనీయ' దర్యాప్తు కావాలట! అసలు తన ఎన్నికే సంశయాస్పదమైంది. పాక్ సైన్యం అండదండలతో అందలమెక్కిన చరిత్ర షెహబాజ్‌ది. 2016నాటి పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఇరు దేశాల సంయుక్త దర్యాప్తును నీరు గార్చిందెవరు? పాక్ ప్రతినిధులు మన దేశం వచ్చి దర్యాప్తులో పాల్గొని వెళ్లగా, మన ప్రతినిధి బృందాన్ని మాత్రం పాక్ గడ్డపైకి అనుమతించని వైనం, తాము సేకరించిన సాక్ష్యాలను భారత్‌తో పంచుకోని తీరు షెహబాజ్ మరిచారా? 2008 నాటి ముంబై పేలుళ్ల ఉదంతంలో ఇచ్చిన సాక్ష్యాధారాలకు ఏ గతి పట్టించారో గుర్తులేదా? అణ్వాయుధ దాడికి సిద్ధమంటూ బెదిరింపులకు దిగుతున్న పాక్ దుష్ట పన్నాగాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలి. అందుకు దౌత్యపరంగా మరింత కృషి చేయాలి. దాంతోపాటు అన్నివిధాలా సంసిద్ధతలు పెంపొందించుకోవాలి. సామాజిక మీడియాలో కశ్మీరీలపై విద్వేషాన్ని కక్కే అవాంఛనీయ శక్తుల ఆటకట్టించాలి. ఇది కలసికట్టుగా నిలబడాల్సిన కాలమని చాటాలి.

# హైకోర్టును ఆశ్రయించిన ముగ్గురు ఐపీఎస్‌లు

మొదటిపేజీ తరువాయి

తీర్పు వెలువడే వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులకు స్పష్టం చేసింది. తమ ముందున్న పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారాన్ని రాజ్యాంగం కల్పించిందని, ఆ మేరకు ఆర్టికల్ 226ను వినియోగించుకుని ఈ ఆదేశాలు ఇస్తున్నామని తేల్చిచెప్పింది.

తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ భూములను విక్రయించడం, బదిలీ చేయడం సహా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ప్రతివాదులకు స్పష్టంచేసింది. అదీగాక, ఆరోపణల తీవ్రత దృష్ట్యా పిటిషన్ ఉపసంహరించుకునే అవకాశాన్ని పిటిషనర్‌కు ఇవ్వడం లేదని పేర్కొంది. ఒకవేళ పిటిషనర్ ఉపసంహరించుకోవాలని భావించినా అనుమతించవద్దని రిజిస్ట్రీని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూ కబ్జాలపై ఫిబ్రవరి 16న, మార్చి 8న అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేసే చర్యలు చేపట్టారన్నారు.

ఇప్పటికే కొందరు అనధికారికంగా భూములను బదిలీ కూడా చేయించుకున్నారని చెప్పారు. 26 మంది ఉన్నతాధికారులు భూకబ్జాలో ఉన్నందున ఈ అంశంపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం గత గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. 'భూదాన్ భూములపై బినామీల పేరిట రిజిస్ట్రేషన్, భూ కబ్జా, మనీలాండరింగ్‌పై విచారణ జరిపించాలని మహేశ్ పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కుంభకోణంలో ఉన్నారు.

కొందరు అధికారులకు అందజేసిన పట్టాదారు పాస్‌బుక్‌లు, మ్యుటేషన్ ప్రొసీడింగ్‌లపై వివరాలు సమర్పించేలా రిజిస్ట్రేషన్, స్టాంపుల కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేయండి. భూకబ్జాలో తెలంగాణతోపాటు ఏపీకి చెందిన సీనియర్ అధికారుల పాత్ర ఉంది. పిటిషనర్‌కు హక్కుగా ఉన్న భూమిని మోసపూరితంగా బదిలీ చేసుకున్నట్లు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు చూపించారు.

అధికారులు భూరికార్డులను ఎలా తారుమారు చేశారో, తప్పుడు వారసత్వ పత్రాలు ఎలా తయారయ్యాయో.. పట్టాదార్ పాస్‌బుక్‌లను చట్టవిరుద్ధంగా ఎలా జారీ చేశారో దర్యాప్తు చేయాల్సి ఉంది. ధరణి పోర్టల్‌ను కూడా దుర్వినియోగం చేశారు. తన భూమి కోసం పోరాడుతున్న పిటిషనర్‌కు సాయం చేసే బదులు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. ఇప్పటికే 10కిపైగా లీగల్ నోటీసులు పంపారు.

క్షమాపణ చెప్పకపోతే తీవ్ర చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు. మోసపూరిత పాస్‌బుక్‌లను రద్దు చేయాలి. భూమిని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవాలి. సంబంధిత అధికారులపై విచారణకు ఆదేశించాలి' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇది అతి పెద్ద భూ కుంభకోణంలా కనిపిస్తున్నందున ఆ భూములకు సంబంధించి తదుపరి లావాదేవీలన్నింటినీ నిలిపివేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను జూన్ 12కు వాయిదా వేశారు.

## యాదాద్రి జిల్లాలో భారీ పేలుడు..
## ఇద్దరు మృతి.. ఏడుగురికి సీరియస్..!

మొదటిపేజీ తరువాయి

పేలుడు ధాటికి భవనం కుప్పకూలింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. పేలుడుకి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి గురైన వారిని చాడ గ్రామానికి చెందిన రాజబోయిన శ్రీకాంత్, పులిగిల్ల గ్రామానికి చెందిన బుగ్గ లింగస్వామి, ఆత్మకూరు గ్రామానికి చెందిన నరేష్, కుందుకూరి గ్రామానికి మహేందర్, ఆలేరుకు చెందిన బర్ల శ్రీకాంత్, అనాజిపురం గ్రామానికి చెందిన నల్ల మహేష్ గా గుర్తించారు. మిగిలిన వారి సమచారాం తెలియాల్సి ఉంది.

## మేడిగడ్డలో అవినీతి జరిగిందని
## ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు

మొదటిపేజీ తరువాయి

ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు.
కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. "జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయి" అని విమర్శించారు.

## భారాస నేతల నిర్లక్ష్యమే
## 'కాళేశ్వరం'ని దెబ్బతీసింది: ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు.
అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్డీఎస్ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయింది" అని ఉత్తమ్ మండిపడ్డారు.

## జూన్ 2 నుంచి రాష్ట్ర
## వ్యాప్తంగా భూభారతి అమలు

మొదటిపేజీ తరువాయి

18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను పరిశీలించి, మేధావులతో చర్చించి భూభారతి చట్టం తయారు చేశాము. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే అధికారులు మీ ఇంటికి వచ్చి విచారణ చేస్తారు. పైలెట్ ప్రాజెక్ట్ గా నాలుగు మండలాలను సెలెక్ట్ చేశాము. జూన్2 లోపు ఆ మండలాల్లో భూ సమస్యలు పూర్తిగా క్లియర్ చేస్తాం. జూన్ 2నుండి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి అమలు చేస్తాం. అధికారులే మీ ఇంటికి వచ్చి దరఖాస్తులు తీసుకొని సమస్యలు తీరుస్తారని చెప్పారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.
గత ప్రభుత్వంలో పేదల భూములను దొబ్బిన నాయకులకు దుఃఖం వస్తుందని ఫైర్ అయ్యారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే కేసీఆర్ కు దుఖం వస్తుందన్నారు దుఃఖం వస్తుందని కపట ప్రేమ చూపిస్తూ కేసీఆర్ మొన్న యాక్షన్ చేశారని ఫైర్ అయ్యారు. తన ఉద్యోగం పోయినందుకు కేసీఆర్ కు దుఃఖం వస్తుందా..? కాంగ్రెస్ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కేసీఆర్ కు దుఃఖం వస్తుందా.? కేసీఆర్ కు ఎందుకు దుఃఖం వస్తుందని ప్రశ్నించారు. రెండు సార్లు ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టినందుకే కేసీఆర్ కు దుఃఖం వస్తుందేమోనన్నారు. ఎందుకు దుఃఖం వస్తుందో కేసీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

దేశ,విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీ-ల్లో పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీ-లు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభవన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు- చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## రుణమాఫీపై ఏ బాయికాడ
## మాట్లాడుదాం.. కేసీఆర్ కు జగ్గారెడ్డి
## సవాల్

మొదటిపేజీ తరువాయి

' మేము అడ్డుకుంటే బీ ఆర్ ఎస్ సభ నడిచేదా బీఆర్ ఎస్ నాయకులు డాన్స్ లు చేసే వారా కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికి స్వేచ్ఛ దొరికింది. సచివాలయంలోకి అందరూ స్వేచ్ఛగా పోతున్నారు. కేసీఆర్ హాయంలోకి ఎవ్వరిని పోనియ్యలేదు' అని జగ్గారెడ్డి అన్నారు.

## తక్షణమే ఆపరేషన్
## కగార్ నిలిపివేయాలి

మొదటిపేజీ తరువాయి

మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ, చత్తీస్‌గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు.
అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటు-న్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ- బృందం కలిసింది. కాగా.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు- చేస్తున్నట్లు- సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు గత వారం రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. ఆపరేషన్ కర్రెగుట్టలు నిలిపివేయాలని ఓ వైపు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి. అటు- మావోయిస్టులు కూడా ఇప్పటికే మూడు నాలుగు సార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అంతేకాకుండా కర్రెగుట్టలపై బేస్ క్యాంప్‌ను ఏర్పాటు- చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈరోజు ఒక్కరోజే వెంకటాపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి కర్రెగుట్టలపైకి రెండు హెలికాప్టర్లు నాలుగు సార్లు అక్కడకు వెళ్లి బలగాలు, మందుగుండు సామాగ్రిని తరలించాయి. ఇటీ-వల వడదెబ్బ కారణంగా 40 మంది జవాన్లు వెనక్కి వచ్చినప్పటికీ రెట్టింపు సంఖ్యలో బలగాలను చేరవేస్తూ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**- పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**బోధన్ / నిజామాబాద్ (మన వెలుగు) ఏప్రిల్ 29 :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ఆడిటోరియం హాల్ లో భూభారతి నూతన చట్టంపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని, భూభారతి చట్టం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని ఎమ్మెల్యే వివరించారు. ప్రధానంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చిందని, ఏ విధంగా చూసినా ఇది రైతులకు వారి భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించేలా అన్ని అంశాలను పొందుపర్చారని తెలిపారు. ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. కాగా, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తొలి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 మంది చొప్పున నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు. లబ్ధిదారులు అందరూ ఇళ్లను నిర్మించుకునేలా వారికి తోడ్పాటును



అందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా నామమాత్రపు రుసుముతో ఇసుక సరఫరా అయ్యేలా చొరవ చూపాలని అన్నారు.
కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ధరణి వల్ల పరిష్కారం కాని అనేక భూ సంబంధిత సమస్యలు భూభారతి ద్వారా పరిష్కారం జరిగేలా ప్రభుత్వం ఈ నూతన చట్టాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. ధరణిలో ఉన్న భూముల రికార్డులను భూభారతిలో నమోదు చేస్తారని అన్నారు. భూమి వివరాలు ఏమైనా తప్పుగా నమోదైతే, భూ భారతి చట్టం అమలులోకి వచ్చిన ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే, జూన్ మాసాలలో నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ అన్ని రెవెన్యూ గ్రామాలలో అధికారులు హాజరై రైతు సదస్సులు నిర్వహిస్తారని, భూ సమస్యలు కలిగిన రైతులు ఈ సదస్సులలో అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వాటిని తహసీల్దార్, ఆర్డీఓ లు తమతమ స్థాయిలో విచారణ జరిపి మ్యుటేషన్, రిజిస్ట్రేషన్లు చేస్తారని అన్నారు. వీటిపై రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను ప్రవేశ పెట్టిందని వివరించారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలోనే భూధార్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. అంతేకాకుండా భూమి వివరాలు, హద్దులను స్పష్టంగా సూచించేలా భూ పటం (సర్వే మ్యాప్)ను పట్టా పాస్ బుక్కులలో పొందుపరుస్తారని అన్నారు. భూమి హక్కుల రికార్డులు అందరికీ అందుబాటులో ఉంటాయన్నారు. ఇదివరకు అమలులో ఉన్న ధరణి చట్టంలో ఎవరైనా తమ రికార్డులను కనిపించకుండా చేసుకునే విధానం



ఉండేదని, ప్రస్తుత భూ భారతి చట్టంలో హక్కుల రికార్డు పారదర్శకంగా ఉంటుందన్నారు. ఎవరైనా సర్టిఫైడ్ కాపీలు కావాలంటే భూ భారతిలోని ఫారంలో రూ.10 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని, తహశీల్దార్ సర్టిఫైడ్ కాపీలు జారీ చేస్తారని సూచించారు. గ్రామ పహానీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్, మార్పుల రిజిస్టర్, నీటి వనరుల రిజిస్టర్లను ప్రభుత్వం నిర్వహిస్తుందని, భూమి హక్కుల రికార్డుల్లోని వివరాలను ఈ రికార్డులో ఆన్ లైన్ ద్వారా పొందుపరుస్తారని తెలిపారు. మ్యుటేషన్ చేసిన ప్రతిసారి ఆన్లైన్ లో గ్రామ లెక్కల్లో మార్పులు జరుగుతాయని, ప్రతి సంవత్సరం డిసెంబరు 31వ తేదీన గ్రామ రెవెన్యూ రికార్డులను ప్రింట్ తీసి భద్రపరుస్తారని అన్నారు. ఏటేటా రిజిస్టర్ల వివరాల అప్ డేట్, నిర్వహణ వల్ల భూముల వివరాలు పక్కాగా ఉంటాయని తెలిపారు.
ధరణి అమలైన తర్వాత గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ నిలిచిపోయిందని, తిరిగి ప్రస్తుతం భూభారతి తో మళ్లీ రికార్డుల నిర్వహణ జరుగుతుందని వివరించారు. మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ లలో అధికారులు ఎవరైనా కావాలని తప్పిదాలకు పాల్పడితే, అలాంటి వారిపై కేసులు నమోదు చేసేలా భూభారతి చట్టంలో నిబంధనలు పొందుపర్చారని, తద్వారా పారదర్శకంగా సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే, సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో భూభారతి చట్టంపై రైతులకు కలెక్టర్, అదనపు కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సదస్సులలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిపై తీన్మార్ మల్లన్న వాక్యాలు సరికాదు

**- అందే భవితారాణి కోరుట్ల నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు**

**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 29 :**



మొన్న జరిగిన బి ఆర్ఎస్ 25వ రజతోత్సవ సభలో కెసిఆర్ చేసిన ప్రసంగాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్టు కోరుట్ల నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అందే భవితారాణి అన్నారు గత బి ఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి పాలనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు రేవంత్ రెడ్డి పేరును పలగడానికే కేసీఆర్ భయపడ్డారని దాన్ని రేవంత్ రెడ్డి పేరు ఎత్తకపోవడం గంజిలో ఈగతో పోల్చడం తీన్మార్ మల్లన్నకు తగదని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిని అనుభవిస్తూ ముఖ్యమంత్రిని ఏదోరకంగా విమర్శించడం పద్ధతి కాదు మల్లన్న ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ముఖ్యమంత్రిపై లేనిపోని వాక్యాలు చేయడం మంచిది కాదని మల్లన్న చేస్తున్న విమర్శలు బీసీలే వ్యతిరేకిస్తున్నారని అందే భవిత రాణి అన్నారు ఇప్పటికైనా మల్లన్న తీరు మార్చుకోకపోతే మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై అన్ని కులాలు మతాలు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ పనితీరును హర్షిస్తున్నారని దానిని చూసి ఓర్వలేక తీన్మార్ మల్లన్న నువ్వు బిఆర్ఎస్ తొత్తుగా మారి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేస్తే కుట్రలు కుతంత్రాలు మానుకోవాలని అందే భవితరాణి అని అన్నారు

## మేడ్చల్‌లో భారీ అగ్ని ప్రమాదం



**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) ఏప్రిల్ 29 :**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలో బాసరగాడిలో గల కేకేసీ ఎలక్ట్రికల్స్ అనే ఫ్యాన్ తయారీ పరిశ్రమలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని ప్రమాదం జరగడంతో స్థానికులు తీవ్ర భయాందో ళనలు చెందుతున్నారు. వెంటనే పోలీసులకు, ఫైర్ సిబ్బందికి స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు ఫైర్ సిబ్బంది చేరుకున్నారు.
మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. భారీగా మంటలు వ్యాపించడంతో చుట్టూ పక్కల పొగలు అలుముకున్నాయి. పొగలు దట్టంగా వ్యాపించడంతో చుట్టుపక్కల స్థానికులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులను భద్రత పరంగా సంఘటన స్థలం నుంచి పోలీసులు దూరంగా పంపించి వేస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అసలు ఈ ప్రమాదం ఎలా చోటు చేసుకుందనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే వరుస అగ్ని ప్రమాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రిటైర్డు ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

**- టాప్రా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మహా ధర్నా**

**హైదరాబాద్ (మన వెలుగు) ఏప్రిల్ 29 :**
తెలంగాణ ఆల్ పెన్షనర్స్ మరియు రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మహా ధర్నా రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి సంధానకర్తగా వ్యవహరించారు.ధర్నా శిబిరాన్ని టిజిఇజేయేసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస రావు ప్రారంభిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల, టీచర్ల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున ఉద్యమించడానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 27 డిపార్ట్ మెంట్ల సమస్యల పరిష్కారానికి డిపార్ట్మెంట్ వారిగా డిమాండ్లకు సమాధానం ఇవ్వమంటే ఇప్పటికి 9 డిపార్ట్మెంట్స్ నోటు పంపించాయన్నారు. పూర్వ ఎంఎల్సీ ఎ. నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయలేని విధంగా కేంద్రం ఆదేశాలిస్తోందనీ, సిపియస్ ని రద్దు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు అనకుండా చేస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా భావావేశాలు రెచ్చగొట్టే పనులు మానుకోవాలన్నారు. సిఐటియు నాయకులు వివిఎస్ రావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగుల, పెన్షనర్ల, కార్మికుల సంక్షేమం కోసం పని చేయడం లేదని, కేవలం కార్పొరేట్లు, కాంట్రాక్టర్ల కోసమే పని చేస్తుందని ఈ విధానం మార్చుకోకపోతే గత ప్రభుత్వాన్ని దించేసినట్లే ఈ ప్రభుత్వాన్ని దించేసే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరారు. తాప్రా సీనియర్ నాయకులు ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ



పెన్షనర్లకు రావలసిన బెనిఫిట్లు చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. పూర్వ ఎన్జిఓ నాయకులు యు. అంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగ సంఘాలను చీల్చి నాయకులను తమ ఆధీనంలో పెట్టుకుని ఉద్యమాలు రాకుండా లోపాయకారి విధానాలు అవలంబించడం సరికాదని, సంఘాలన్నీ కలిసి ఉద్యమించాలని కోరారు.టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు చావా రవి మాట్లాడుతూ మార్చి 2024 తదుపరి రిటైరైన వారికి సంవత్సర కాలం గడుస్తున్నా పెన్షనర్ బెనిఫిట్లు చెల్లించలేదన్నారు. చెల్లించాల్సిన బకాయిలే కాకుండా ప్రభుత్వం దగ్గర ఉద్యోగులు తమ సర్వీసు కాలమంతా పొదుపు చేసి దాచుకున్న పిఎఫ్, ఎల్ఐ డబ్బులు కూడా చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వెంటనే వారికి చెల్లించాల్సిన బెనిఫిట్లన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు.తాప్రా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ పెన్షనర్లకు రావలసిన 5డిఆర్లు మంజూరు చేయాలనీ, వేతన సవరణ కమిషన్ రిపోర్టు తెప్పించుకుని అమలు చేసే ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. తాప్రా ఉపాధ్యక్షులు మచ్చా రంగయ్య మాట్లాడుతూ తెలంగాణ మొదటి వేతన సవరణ కమీషన్ సూచనలు మేరకు 20 సంవత్సరాల సర్వీసుకు పూర్తి పెన్షన్ చెల్లించే ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలనీ, రూ 398 ల వేతనం పై పని చేసిన స్పెషల్ టీచర్ సర్వీసుకు ఆం. ప్ర. ప్రభుత్వం మాదిరిగా



నోషనల్ ఇంక్రిమెంట్లు ఇస్తూ పెన్షనరీ బెనిఫిట్స్ కు అనుమతించాలని కోరారు.తాప్రా ఉపాధ్యక్షురాలు డా ఎల్ అరుణ మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొనే ప్రధాన సమస్య ఆరోగ్య సమస్య అంటూ ప్రభుత్వ హెల్త్ స్కీంకు సంబంధించిన హెల్త్ కార్డులు ఏ ఆసుపత్రిలో కూడా పని చేయడం లేదని ఈహెచ్ఎస్ స్కీంను అన్ని ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చుల రేట్లు ప్రస్తుత రేట్లకు అనుగుణంగా సవరించాలన్నారు. సీనియర్ నాయకురాలు కమల కుమారి మాట్లాడుతూ మెడికల్ రీఎంబర్స్ మెంట్ ప్రతిపాదనలు సంవత్సరాలు గడుస్తున్నా చెల్లింపులు జరగడం లేదని మూడు నెలల్లో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతారాం మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ధర్నాలో రాష్ట్ర నాయకులు ప్రభాకర్ నాయర్, ఎం నరహరి, కె నాగేశ్వర్ రావు, స్వరాజ్ కుమార్, బ్రహ్మయ్య, లక్ష్మి నారాయణ, జనార్ధన్, నర్సింగరావు, రామారావు, రమేశ్, రాధాకృష్ణ, వి. కృష్ణ మోహన్, రామదాస్, జగదీశ్వర్, బాలరాజు, శ్యాంసుందర్, జి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.వి. కృష్ణ మోహన్, జాతీయ చైర్మన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్ (సీసీజీజీఓఓ)

## జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందికి నగదు పురస్కారం

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 29 :**



గంజాయి ముఠా గుట్టు రట్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ కి ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. దీంతోపాటు సిబ్బందికి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ రాష్ట్ర డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి చేతుల మీదుగా 15 వేల రూపాయల నగదు అందజేశారు. జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో జిల్లాలో ఇటీవల కాలంలో గంజాయి స్థావరాలపై వరుస దాడులు నిర్వహిస్తూ 30.250 కిలోల గంజాయితో సహా పది లక్షల సొత్తు పట్టుకోవడంతో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి చేతుల మీదుగా సీఐ స్వప్నకు 5000/- రూపాయలు సిబ్బందికి 10,000/- రూపాయలు నగదు పురస్కారాన్ని అందించారు. గత ఫిబ్రవరి నెలలో కూడ గంజాయి స్థావరాలపై దాడి చేసి 91 కిలోల స్వాధీనం చేసుకున్నందుకు రాష్ట్ర ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సీఐ స్వప్న బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి 30 వేల రూపాయల నగదు పురస్కారాన్ని అందించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడిషనల్ కమిషనర్ ఖురేషి, జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

**- అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 29 :**
నిజామాబాద్ నగరంలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులపై ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అసహనం వ్యక్తం చేశారు. గంగాస్థాన్ ఫేజ్-1లో కొనసాగుతున్న పనులతోపాటు మురుగునీటి శుద్ధీకరణ ప్లాట్ ను ప్రజారోగ్యశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇందూర్ కార్పొరేషన్ కు అమృత్ -2 కింద భూగర్భజలాల అభివృద్ధి, వాటర్ వర్క్స్ పనుల కొసం



సుమారు రూ.400 కోట్లు విడుదలయ్యాయన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల్లో భాగంగా 150మ్యాన్ హోళ్ల పునర్నిర్మాణంతోపాటు 45 కొత్తగా నిర్మించినట్లు తెలిపారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఒక కిలోమీటర్ పైప్ లైన్ వేయడం జరిగిందన్నారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ



పనులు త్వరత గతిన పూర్తి చేయాలని,పనులను నాణ్యతతో పూర్తి చేయాలనీ అధికారులు,కాంట్రాక్టర్ కు సూచించారు. ఎమ్మెల్యే వెంట డీఈ నగేశ్ రెడ్డి,సాయి చంద్,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోల్ల లక్ష్మీనారాయణ, బీజేపీ కంఠేశ్వర్ మండల అధ్యక్షులు ఆనంద్ రావు,నాయకులు సాయి ప్రవీణ్, మఠం పవన్, ఆనంద్,నాయకులు,తదితరులున్నారు.

# రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి, భారతీయ జనతా పార్టీ మధ్య ప్రధాన పోటీ

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జి. కిషన్ రెడ్డి గారి అధ్యక్షతన, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడినారు

మొన్న జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా మజ్లిస్ పార్టీని ఎదుర్కొనే ఘనత బిజెపి కే ఉందని స్పష్టమైన సంకేతం తెలంగాణ ప్రజలకు, హైదరాబాద్ నగర ప్రజలకు సందేశం ఇవ్వడం జరిగిందన్నారు రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి, భారతీయ జనతా పార్టీ మధ్య ప్రధాన పోటీ ఉంటుందన్నారు నరేంద్ర మోదీ గారు ప్రధానమంత్రి అయ్యాక జమ్ము కశ్మీర్ లో ఉగ్రవాదాన్ని అరికట్టే ప్రయత్నం చేశారు. యూపీఏ హయాంలో దేశంలో అనేక ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు, కర్ఫ్యూలు, మతకల్లోహాలు, ఉగ్రవాద సంబంధిత కార్యక్రమాలు జరిగేవని మన హైదరాబాద్ నగరంలోని లుంబినీ పార్కులో, కోఠిలోని గోకుల్ చాట్ లో, ఎల్బీనగర్ లో కూడా బాంబు పేలుళ్ల ఘటనలు జరిగాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెర్రరిజంపై "జీరో టోలరెన్స్" విధానాన్ని అవలంభిస్తూ ఉగ్రవాదాన్ని అరికట్టే ప్రయత్నం చేస్తోందన్నారు2019లో ఆర్టికల్



317 తొలగించిన తర్వాత జమ్ము కశ్మీర్ లో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. పోలీసులపై రాళ్లు రువ్వడం వంటి ఘటనలు తగ్గాయి. శాంతిసామరస్యం ఏర్పడింది. అయితే ఇది పాకిస్థాన్ కు కంటగింపుగా మారిందని జమ్ము కశ్మీర్ లో 75 సంవత్సరాల తర్వాత బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోంది. భారతదేశంలో జమ్ము కశ్మీర్ అంతర్భాగంగా ప్రపంచమంతా అంగీకరిస్తోంది. అయితే, ఇది మన దేశంలోని కొన్ని అంతర్గత శక్తులకు ఇష్టంలేదు. జమ్ము కశ్మీర్ మాదేననేలా మాట్లాడుతున్న పాకిస్తాన్ కు కూడా ఇష్టం లేదన్నారు అందుకే, భారతదేశంలోని శాంతిని, సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రయత్నం చేస్తున్నారు.పాకిస్తాన్‌లోని అంతర్గత సమస్యలను ఎదుర్కోలేక, దేశ ప్రజలకు తిండి, ఉపాధి కల్పించలేక, దృష్టిని మరల్చడానికి జమ్మూ-కశ్మీర్‌లో మరోసారి బాంబుదాడులను ప్రేరేపించేందుకు కుట్రలు చేస్తున్నది.ఇటీవల పెహల్గామ్ లో అమాయక హిందువులను వారి కుటుంబ సభ్యుల ఎదుటే.. అతికిరాతకంగా ఉగ్రవాదులు కాల్చిచంపారు.

భారతదేశ ప్రజలే కాకుండా ప్రపంచ దేశాలు పెహల్గామ్ ఉగ్రవాద ఘటనను ఖండిస్తున్నాయనిఉగ్రవాద దాడికి సంబంధించి బాధితులకు న్యాయం చేసేలా, దోషులను శిక్షించేలా చర్యలు తీసుకుంటామని భారత ప్రభుత్వం, స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ప్రకటించారన్నారుఈ నేపథ్యంలో మనమంతా దేశ ప్రజలందరినీ సంఘటితం చేసి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, రక్తపాతానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతు కూడగట్టి దేశంలో శాంతి, సామరస్యంతో ఉండేలా ముందుకెళ్లాలి.గ్రామగ్రామన ప్రజలందరూ రాజకీయాలు, కులాలకతీంగా ఏకమై పెహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద ఘటనకు వ్యతిరేకంగా స్పందిస్తున్నారు.బిజెపి రాష్ట్రస్థాయి సమావేశంలో మనమందరం పెహల్గామ్ ఉగ్రవాద సంఘటనకు వ్యతిరేకంగా తీర్మానం ఆమోదించడం జరిగింది.ఉగ్రవాదులకు శిక్షపడాలని మనమంతా కోరుకుందాం.భారతదేశ ప్రజలందరూ సంఘటితంగా నిలబడి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రజలు ఒక్కతాటిపైకి వచ్చి స్పందిస్తున్నారు.

## పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు: పీసీసీ పరిశీలకులు, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్



హైదరాబాద్ ఏప్రిల్ 29 జన తెలంగాణ,
Aicc, pcc ఆదేశాలు మేరకు, రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ సూచనలతో.... నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిధులుగా పీసీసీ అబ్జర్వర్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్. జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ...పార్టీ కోసం పని చేసిన వారికి సంస్థాగత పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.

కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారిని పార్టీ గుర్తిస్తుందని, అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు.

తానూ కూడా పార్టీ కోసం పని చేశానని, నా పనిని చేసే అధిష్టానం తనకు అతి చిన్న వయసులోనే ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించిందన్నారు.

అలాగే నిజామాబాద్ జిల్లాలో ఏంతో మంది కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రతిపక్షంలో ఉన్నపుడు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేశారని గుర్తు చేశారు.

అవకాశం వచ్చినా...రాకపోయినా... పదవులు ఉన్నా... లేకున్నా పార్టీ సిద్ధాంతం కోసం పని చేస్తే... పదవులు అవే వస్తాయన్నారు.

జిల్లా, బ్లాక్, మండల, గ్రామ స్థాయిలలో పర్యటించి, అందరి అభిప్రాయాలు తీసుకుని, జిల్లాలోని Mla \T, Mlc లు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలను ఒపీనియన్ తీసుకుని ఆశావహుల జాబితాను తయారు చేసి, అధిష్టానానికి పంపిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ex ఎమ్మెల్సీలు అరికెల నర్సి రెడ్డి, రాజేశ్వర్ రావు, ఆకుల లలితా, కార్పొరేషన్ చైర్మన్లు, Dcc అధ్యక్షులు, నియోజక వర్గాల ఇంచార్జులు, జిల్లా కాంగ్రెస్, బ్లాక్, మండల, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జాతీయ జెండా కోసం బలిదానం అయిన విద్యార్థి నాయకుడు సామా జగన్మోహన్ రెడ్డి

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 29 :

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని కవిత కాంప్లెక్స్ లో ఘనంగా సామాజియన్ మోహన్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూరు విభాగ్ కైరి శశిధర్ మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటిష్ వలస పాలన దాస్య శృంకలాల నుండి విముక్తి చేయడం కోసం ఎంతోమంది భరతమాత ముద్దుబిడ్డలు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా ఆ విదేశీయుల వలసవాద భావజాలాన్ని నింపుకున్న కొందరు స్వదేశీయులు దేశాన్ని అస్థిర పరచడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వారి ప్రయత్నాలను తిప్పికొట్టి,యువతలో దేశభక్తి,జాతీయ భావజాలాన్ని పెంపొందించే క్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తలు ఎంతోమంది ప్రాణాలు అర్పించారు. అటువంటి మహానుభావులలో సామా జగన్మోహన్ రెడ్డి ఒకరు. విదేశ భావజాల కమ్యూనిస్టులు దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తూ డా బాబాసాహెబ్



అంబెద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానిస్తూ దేశంలో నక్సలిజం పేరుతో అరాచకాలు సృష్టిస్తున్న సమయంలో,జాతీయ జెండా గౌరవం కోసం ప్రాణాలు అర్పించారు సామా జగన్మోహన్ రెడ్డి. వరంగల్ జిల్లాలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. అది 1980 వ సంవత్సరం. కాకతీయ విశ్వవిద్యాలంలో విద్యార్థులు,సిబ్బంది కమ్యూనిస్టు ప్రేరేపిత నక్సలైట్లకు భయపడే పరిస్థితులు ఉండేవి. కాకతీయ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న జగన్మోహన్ రెడ్డి, సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. చిన్నప్పటి నుండి దేశభక్తి,జాతీయభావంతో ఉండేవారు. ఏబీవీపీ విశ్వవిద్యాలయ అధ్యక్షుడిగా విద్యార్థి,విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయడంలో చురుకుగా ఉండేవాడు. దేశభక్తి,జాతీయవాద ,నిర్మాణాత్మక భావజాలాన్ని విద్యార్థులలో పెంపొందించడానికి విభిన్న కార్యక్రమాలు నిర్వహించేవారు. విదేశీ భావజాలాన్ని నింపుకున్న కమ్యూనిస్టు ప్రేరిత ముష్కరులు దేశాన్ని విచిన్నం చేసే ప్రయత్నాలను ఎదిరించే లక్షలాది మంది యువతకు ఆదర్శం అయ్యాడన్నారు. దేశంలో నక్సలైట్లు అంతరించిపోయినా,విచిన్నకర శక్తులు అర్బన్ నక్సలైట్ల రూపంలో దేశ ప్రజలలో ఆందోళన, దేశ వ్యతిరేక భావన పాదుకొల్పడానికి జాతిని అవమానించే తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూనే ఉన్నారు. వారి ప్రయత్నాలు సఫలం కాకుండా అడ్డుకునే విధంగా యువత దేశభక్తి, జాతీయభావం నిరంతరం పెంపొందించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు వెంకటకృష్ణ,కండక్టర్ జోనల్ ఇంచార్జ్ దుర్గా దాస్ ప్రేమ్ వాసు విష్ణు సాత్విక్ ఈశ్వర్ సన్నీ అభినవ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## పహల్గంలో ఉగ్రవాదుల దాడిని ఖండించిన సీనియర్ సిటిజన్ సభ్యులు



పహల్గంలో ఉగ్రవాదులు హిందువులపై కాల్పులు జరిపి 27 మందిని చంపడాన్ని గోదావరిఖని సీనియర్ సిటిజన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు పీటీ స్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ కాశ్మీర్ లో ప్రశాంతమైన వాతావరణాన్ని తీసుకువచ్చారని అలాంటి చోట పాకిస్తాన్ ఉగ్రవాదులు అశాంతిని రేకెత్తించేలా హిందువులపై కాల్పులు జరిపి 27 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందని, పాకిస్థాన్ చర్యలను ప్రతిఘటించడానికి భారతదేశ ప్రజలంతా ప్రధాని నరేంద్ర మోడీ వెంట నడవాలని కోరారు. ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న పాకిస్థాన్ పై ప్రధాని మోడీ యుద్ధం ప్రకటించకుండా తెలివిగా అంతకంటే విలువైన పాకిస్తాన్ కు వెళ్ళే సింధూ జలాలను ఆపారని తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఉగ్రవాదులను భారతదేశానికి అప్పగించి, భారతదేశ ప్రజలను క్షమాపణలు కోరాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సీనియర్ సిటిజన్ సభ్యులు గంట సత్తయ్య, సుంక లక్ష్మీనారాయణ, జాక సత్యనారాయణ, రాంచందర్ రావు,జైహింద్, ఆగమ రెడ్డి, రఘుపతి, ప్రకాష్ రెడ్డి,నారాయణ రెడ్డి, వేపూరి రాములు, ఎల్లాగౌడ్, నాగరాజు, కోట కనకయ్య, రమణ బాబు, కోటగిరి వాసు, బట్టల వెంకటి, చంద్రమౌళి, మెతుకు లచ్చన్న, అబ్బ రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీని చాటుకున్న బస్సు కండక్టర్ వెంకటేశ్వర్లు

హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) ఏప్రిల్ 29 :



ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న రూ.13 లక్షల విలువైన బ్యాగును తిరిగి అప్పగించి కండక్టర్ నిజాయితీని చాటుకున్నారు. ఈ నెల 26న హైదరాబాద్ - అచ్చంపేట రూట్ కు చెందిన ఆర్టీసీ బస్సులో కందుకూర్ లో బస్సు ఎక్కిన ప్రయాణి కుడు రూ.13 లక్షల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలతో పాటూ కొంత నగదు ఉన్న బ్యాగును సీబీఎస్ లో మరిచి దిగిపోయాడు. బ్యాగు అచ్చంపేట డిపోకు చెందిన కండక్టర్ వెంకటేశ్వర్లుకు దొరకడంతో ఈ విషయాన్ని అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్ కు ఫోన్ లో సమాచారం అందించారు. ఈమేరకు బ్యాగ్ ను ఎంజీబీఎస్ లోని స్టేషన్ మేనేజర్ ఆఫీస్లో అప్పగించాలని డీఎం సూచించారు.ఇంతలోనే అనిల్ కుమార్ అనే ప్రయాణికుడు డీఎంకి ఫోన్ చేసి బస్సులో బ్యాగు ను మరచిపోయినట్లు చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ అధికారులు వివరాలను పరిశీలించి, బ్యాగును ప్రయాణికుడు అనిల్ కుమార్ కు అందజేశారు. కండక్టర్ వెంకటేశ్వర్లు ను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఇవాళ బస్ భవన్ లో సన్మానించి అభినందించారు.

## కార్మికులందరికీ మేడే రోజు సెలవు ఇవ్వాలి

**- అసిస్టెంట్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన టియూసిఐ నాయకులు**

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 29 :



అన్ని రంగాల కార్మికులకు మేడే రోజు సెలవు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి,అసిస్టెంట్ కమీషనర్ శ్రావణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులందరికీ మేడే పండగ రోజన్నారు. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా మేడే సెలవు రోజుగా పరిగణించబడుతుందన్నారు. కానీ మేడే సెలవు రోజును పెయిడ్ హాలిడేగా కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. దీంతో మేడే రోజు సెలవు ఉండదని,ఐతే పనిచేసిన కార్మికులకు అదనపు వేతనం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానీ ఏ యాజమాన్యం కార్మికులకు అదనపు వేతనం ఇవ్వడం లేదన్నారు. అదే సమయంలో కార్మికుడు మేడే సెలవును కోల్పోతున్నాడన్నారు. కార్మికులను సంఘటితం కాకుండా,వారు పోరాట స్ఫూర్తికి దూరంగా నెట్టవేయడానికి,మేడే జరుపుకోకుండా మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికలోకం తిప్పికొట్టాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. జిల్లాలోని కార్మికులు మేడే రోజు సెలవు తీసుకోవాలని,అనివార్యంగా పనిచేస్తే యాజమాన్యాన్ని అదనపు వేతనం అడగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న,డి.రాజేశ్వర్ జిల్లా నాయకులు పి.సాయన్న, నాయకులు ఇంతియాజ్,ధర్మపురి కిషన్,గంగన్న,లక్ష్మీనారాయణ,నర్సింగరావు,గంగాధర్,పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


## విశాకా ఇండస్ట్రీస్ ఆటమ్ ఈ-బైక్ ప్రారంభించిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ



మంగళవారం రాయ్‌బరేలీలో విశాకా ఇండస్ట్రీస్ రూపొందించిన ఆటమ్ సోలార్ రూఫ్ ను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం భారతదేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని, గ్రీన్ మోబిలిటీ పరిష్కారాలను వేగవంతం చేసే దిశగా ఒక కీలక ముందడుగు పడింది. ఈ ప్రారంభ వేడుకలో ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు, ఆటమ్ ఈ-బైక్లను కూడా ప్రారంభించారు. ఈ ఆవిష్కారాలు విశాకా ఇండస్ట్రీస్ పర్యావరణ అనుకూలమైన, ఆవిష్కరణాత్మక దృష్టిని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే డా.వివేక్, కారెస్పాండెంట్, డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థలు సరోజ గడ్డం, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు, విశాకా ఇండస్ట్రీస్ జేఎండీ వంశీ గడ్డం పాల్గొన్నారు.

## 2వ టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 29 :



నగరంలోని 2వ టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన యాసిర్ అరాఫత్ మెండోరా ఎస్సైగా బదిలీ అయిన విషయం తెల్సిందే. జగిత్యాల్ జిల్లాలో వీఆర్ లో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ కు రెండవ టౌన్ ఎస్ ఐ గా పోస్టింగ్ ఇవ్వడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా అధికారులను కలిసారు.

## ట్రాఫిక్ జంక్షన్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్29 :



నిజామాబాద్ నగరంలో తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను నుడా చైర్మన్ కేశ వేణు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ప్రవీణ్ పరిశీలించారు. నూతన ట్రాఫిక్ జంక్షన్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అలాగే వినాయక్ నగర్, బోధన్ రోడ్, గౌతం నగర్, హైదరాబాద్ బైపాస్ ఏరియాల్లో నీరు నిలిచే ప్రదేశాలను పరిశీలించి వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెద్ద డ్రెయినేజీలను నిర్మించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేశ వేణు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కృషితో స్మార్ట్ సిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారి ఆధ్వర్యంలో నగరంతోపాటు జిల్లా అభివృద్ధి చెందుతోందని, ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



## పహల్గాం దాడి.. బాలీవుడ్ తారల యూకే పర్యటన వాయిదా

కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన దుర్ఘటన దేశాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిని వ్యతిరేకిస్తూ ఎంతో మంది సినీతారలు వారికి సంబంధించిన ఈవెంట్‌లను వాయిదా వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ సెలబ్రిటీలు పాల్గొనే 'బాలీవుడ్ బిగ్ వన్' షో యూకే టూర్‌ను వాయిదా వేశారు. తాజాగా ఈ విషయాన్ని తెలుపుతూ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "కశ్మీర్‌లో ఇటీవల జరిగిన విషాద సంఘటనల దృష్ట్యా వచ్చే నెల 4, 5వ తేదీలలో లండన్‌లో జరగాల్సిన 'బాలీవుడ్ బిగ్ వన్"ను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాం. మా అభిమానులు ఈ ప్రదర్శన కోసం ఎంతగా ఎదురుచూస్తున్నారో మాకు తెలుసు. అయితే ఇలాంటి బాధాకర సమయంలో విరామం ఇవ్వడమే సరైనదని అనుకుంటున్నాం. దీన్ని వాయిదా వేయడం అంత తేలికైన విషయం కాదు. కానీ అందరి క్షేమం మాకు ముఖ్యం. దీని వల్ల అభిమానులు ఏదైనా అసౌకర్యానికి గురైతే మేము వారిని క్షమాపణలు కోరుతున్నాం. త్వరలో ఈ షో కొత్త తేదీలు ప్రకటిస్తాం" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. బాలీవుడ్ తారలు కృతిసనన్, మాధురీ దీక్షిత్, వరుణ్ ధావన్, టైగర్ ష్రాఫ్ తదితరులు ఈ వేడుకలో ఆడిపాడనున్నట్లు తెలుస్తోంది.




## శర్వానంద్, సంపత్ నంది సినిమాలో ఎనర్జిటిక్ రోల్‌లో డింపుల్ హయతి

ఇప్పటి వరకూ గ్లామర్ రోల్స్‌తో ఎక్కువగా ఆకట్టుకున్న డింపుల్ హయతి.. ఈసారి ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఫిదా చేయబోతోంది. శర్వానంద్ హీరోగా నటిస్తున్న చిత్రంలో ఆమె ఓ కీలకపాత్రను పోషించబోతోంది. సంపత్ నంది డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్‌ను ఇప్పటికే అనౌన్స్ చేయగా, ఇందులో క్రూషియల్ రోల్ కోసం డింపుల్‌ను ఎంపిక చేసినట్టు సోమవారం ప్రకటించారు.డింపుల్ పాత్ర ఇంటెన్స్‌తో కూడిన హై ఎనర్జీతో ఉంటుందని తెలియజేస్తూ ఆమె ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. శర్వా కెరీర్‌లో ఇది 38వ చిత్రం. 1960 బ్యాక్‌డ్రాప్‌లో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర బ్యాక్‌డ్రాప్‌లో హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా దీన్ని తెరకెక్కిస్తున్నట్టు మేకర్స్ చెప్పారు.శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తుండగా సినిమాటోగ్రాఫర్, మ్యూజిక్ డైరెక్టర్, ఎడిటర్‌ను అనౌన్స్ చేయాల్సి ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇక రవితేజతో 'ఖిలాడి', గోపీచంద్‌తో 'రామబాణం' సినిమాల్లో నటించిన డింపుల్‌కు గత కొన్నాళ్లుగా ఆఫర్స్ తగ్గాయి. మరి శర్వానంద్ సినిమాతో తిరిగి బిజీ అవుతుందేమో చూడాలి!



# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్

## 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగస్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వారం క్రితం యంగ్ టైగర్ ఈ సినిమా సెట్స్ లో పాల్గొన్నారు.

# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు




భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి థండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. డేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరీ ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.

## హీరోల కోసం త్రివిక్రమ్ చూపు వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం




మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళకళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.

## చిత్రదర్శకురాలుకు అరుదైన గౌరవం ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీలో కపాడియాకు చోటు



భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్-మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు. గతేడాది దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాయల్ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా కేన్స్‌లో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ చలనచిత్రోత్సవం మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరగనుంది.